క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కొమ్మూరి



జనగామ రూరల్: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హైదారాబాద్‌లోని ఆయన నివాసంలో మార్యవపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు.

చిల్పూరు: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం హైదారాబాదులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి సన్మానించారు. సాదం గట్టేష్‌యాదవ్, నారగోని పరమేశ్వర్, రాజ్‌కుమార్, బాలరాజు, దయాకర్ ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటి కొండ రాజయ్య శుక్ర వారం హైదరా బాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

బదిలీలు సహజం

నర్మెట: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు, విరమణలు సహజమని హన్మంతాపురం ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సామల కమల అన్నారు. ఇటీవల బదిలీ, ఉద్యోగోన్నతిపై వెళ్లిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం గొట్టం రాజశ్రీ, కొలిపాక సమ్మయ్య, కందుల నరహరిలను శాలువాలు, జ్ఞాపికలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి



నర్మెట: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజ పాలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆహ్వానం మేరకే డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి వేదికనలంకరించగా వేమళ్ళ సత్యనారాయణ, ఎర్రమల్ల సుధాకర్, మాసంపల్లి లింగాజి రసాబాస చేయడం దురదృష్టకరమని, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగి స్తున్న వారిపై అధిష్టానం తక్షణం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీధర్, మోహన్ రెడ్డి, భాగ్యలక్ష్మి, బాల్ సింగ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్‌లో రేషన్ బియ్యం అక్రమంగా డంప్ చేసి వాహనంలో తరలించే క్రమంలో పట్టుకున్నట్లు రఘునాథపల్లి ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. శుక్రవారం ఖిలాషాపూర్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా ఓ ఇంట్లో డంప్ చేసి ఉన్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం బస్తాలను ఇద్దరు వ్యక్తులు టాటా సుమోలో వేసుకుని తరలించే క్రమంలో గుర్తించి బియ్యం స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో కిలో రూ.15 చొప్పున రేషన్ బియ్యం కొనుగోలు చేసి భువనగిరిలో రూ.26 చొప్పున విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్యా రమేష్, మాలోతు వెంకటేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు ఆవు మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు ఇందిరానగర్‌కు చెందిన రైతు చింత ఐలయ్యకు చెందిన జెర్సీ ఆవు ప్రమాదవశాత్తు రిజర్వాయర్ గుంతలో పడి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఐలయ్య ఘన్‌పూర్ శివారు కొత్తపల్లి క్రాస్‌రోడ్డు సమీపాన రిజర్వాయర్ పక్కన ఉన్న మాదారపు హరినాథ్ వ్యవసాయ భూమిని కౌలుకు చేస్తున్నాడు. అయితే ఐలయ్య తన రెండు జెర్సీ ఆవులను ప్రతీరోజూ వ్యవసాయ భూమి వద్ద కట్టేసి మేపుతుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం జెర్సీ ఆవు నుంచి 5 లీటర్ల పాలు తీసి చెట్టుకు కట్టేసి ఇంటికి వెళ్లాడు. అక్కడ ఉన్న గడ్డిని మేస్తూ ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న రిజర్వాయర్ గుంతలో పడింది. దాంతో తాడు ఆవు మెడకు పడి గుంతనీటిలో ఊపిరాడక చనిపోయింది. మధ్యాహ్నం పొలం వద్దకు వచ్చిన రైతు ఆవు రిజర్వాయర్ గుంతలో పడి మృతిచెంది ఉండటాన్ని గమనించి రోదించాడు. తమ కుటుంబానికి జీవనోపాధిగా ఉండే జెర్సీ ఆవు మృతిచెందడంతో రూ.80వేలు నష్టపోయానని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధితరైతు కోరుతున్నాడు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జనగామ రూరల్/బచ్చన్నపేట/జఫర్‌గఢ్/రఘునాథపల్లి: పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. పట్టణం, పలు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడంతోపాటు చిన్నారులకు అన్నప్రాసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో సీడీపీఓ రమాదేవి, ఏసీడీపీఓ సత్యవతి, కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ, డాక్టర్ శ్రీతేజ, మిషన్ శక్తి జిల్లా కోఆర్డినేటర్ పి శారద, సూపర్‌వైజర్లు, మహిళా సాధికారిత జెండర్ స్పెషలిస్టు హేమలత, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



రఘునాథపల్లి: మాట్లాడుతున్న హెచ్‌ఎం శైలజ



బచ్చన్నపేట: అవగాహన కల్పిస్తున్న సత్యవతి



జఫర్‌గఢ్: కస్తూర్బా విద్యాలయంలో..

నీటి నిల్వలు తొలగించాలి



పాలకుర్తి టౌన్: పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు



జనగామ రూరల్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ తదితరులు

పాలకుర్తి టౌన్: సీజనల్ వ్యాధులను నివారించేందుకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని, ఇంటి ఆవరణలో నీటి నిల్వలు తొలగించాలని ఎంపీడీఓ రాములు సూచించారు. శుక్రవారం డ్రైడే పురస్కరించుకుని పాలకుర్తి మండల కేంద్రంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి ఎదుట నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటాచారి, ఏఎన్‌ఎం స్రవంతితోపాటు ఆశ కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

యాక్సిస్ బ్యాంకు ఆధ్వర్యంలో..

జనగామ రూరల్: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా జనగామ యాక్సిస్ బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రీధర్ ఆధ్వర్యంలో పసరమడ్ల గ్రామ పరిధి చంపకిల్స్‌లోని ఎంసీహెచ్ ఆస్పత్రిలో పార్కింగ్ ప్రాంతం అస్తవ్యస్తంగా ఉండడంలో ప్రజలు ఇబ్బంది పడకుండా శ్రమదానం చేశారు. జేసీబీతో పిచ్చి మొక్కలను తొలిగించారు. బీఎమ్ రంజిత్‌కుమార్, సిబ్బంది తిరుపతి, శ్రవణ్, సాగర్,తిరుమల్‌రెడ్డి,కిషన్ ఫయాజ్ పాల్గొన్నారు.

రేషన్‌షాపుల ఎదుట నిల్వ బోర్డులు ఏర్పాటు చేయాలి

పాలకుర్తి టౌన్: రేషన్ షాపుల ఎదుట డీలర్లు సరుకుల నిల్వబోర్డును ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ అదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయలో డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి రేషన్ షాపు ఎదుట నిల్వ సరుకుల బోర్డుతో పాటు ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయబ్ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌ఐ రాకేష్,డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు బానోతు చత్రు నాయక్, కమ్మగాని రమేష్‌గౌడ్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

రఘునాథపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి పొదల లవకుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పాఠశాలల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సర్వే చేపట్టగా .. అనేక సమస్యలతో విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి శుక్రవారం మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డికి ఆయన సంఘం నాయకులతో కలిసి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా లవకుమార్ మాట్లాడుతూ విద్యారంగంపై ప్రభుత్వం చిన్నచూపుతగదన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, విద్యార్థులకు సరిపడు మూత్రశాలలు నిర్మించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొడుగు రమేష్, రొయ్యల మహేష్, అక్షిత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మెమొరాండం అందజేస్తున్న లవకుమార్ తదితరులు

25నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు



జనగామ రూరల్: సమావేశంలో పాల్గొన్న ఫిజికల్ డైరెక్టర్లు

జనగామ రూరల్: ఈనెల 25,26వ తేదీల్లో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు మండల నోడల్ అధికారి రాజేదంర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎమ్మార్సీ సెంటర్‌లో ఎస్జీఎఫ్ సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో క్రీడలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడల్లో పాల్గొనే జట్లు 8374910159 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఎస్జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్, కిషన్ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్లలో 23,24న..

కొడకండ్ల: ఈ నెల 23,24 తేదీల్లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఎస్‌ఓ గ్రేస్‌కేజియారాణి తెలిపారు. శుక్రవారం ఎంఆర్సీలో వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని ప్రతి పాఠశాల నుంచి అండర్ 14, 17 విభాగాల్లో ఐదుగురు చొప్పున క్రీడాకారులను పంపాలని, మండల స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. పీడీలు బండారి సైదులు, శేఖర్, సుధాకర్, పీఈటీలు శిరీష, అలీమున్నీసాలు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు అనిల్, సిద్దారెడ్డి అన్నారు. ఎంఎల్‌హెచ్‌పి.మౌనిక, ఏఎన్‌ఎం సునంద ఆధ్వర్యంలో మండలంలోని శాతపురంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి మహేష్, ఆశ వర్కర్లు మంజుల, సుమలతతోపాటు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రముఖ వ్యాపారి పబ్బ పుల్లయ్య మృతి



పుల్లయ్య (ఫైల్)

జనగామ: పట్టణంలో ఆరు దశాబ్దాలుగా ఐరన్ వ్యాపారంలో రాణిస్తున్న ప్రముఖ వ్యాపారి పబ్బ పుల్లయ్య (92) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. జనగామ తాలూకా పరిధిలోని వ్యాపార కుటుంబాల్లో డిగ్రీ పట్టా పొందిన తొలి యువకుడు పుల్లయ్య. వ్యాపారి పుల్లయ్య మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, వ్యాపార లోకం, ఆయనతో సన్నిహితంగా మెదిలిన మిత్రులు, వ్యాపారంలో కలిసి పనిచేసిన వారు కన్నీటిపర్యంతమయ్యారు. సామాజిక, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో ఎప్పు డూ ముందు వరుసలో ఉండే పుల్లయ్య, మరణా నంతరం నేత్రాలను దానం చేసి తనలోని దాతృత్వాన్ని చాటుకున్నారు. లయన్స్ నేత్ర దానం విభాగం చైర్మన్ గంగిషెట్టి ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. మృతుడి కుమారుడు ఐరన్ అండ్ పెయింట్స్ అసోసియేషన్ నాయకుడు, లయన్స్ క్లబ్స్ జిల్లా అదనపు కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్, ఆయన సోదరులను పూర్వ జిల్లా గవర్నర్లు డాక్టర్ డి.లవకుమార్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ కన్న పరశురాములు, కాసం అంజయ్య, డాక్టర్ మాచర్ల భిక్షపతి, ఛాంబర్ అధ్యక్ష, గౌరవ అధ్యక్షుడు పోకల లింగయ్య, పజ్జూరి గోపయ్య, బాయిల్డ్ రైస్ మిల్లర్స్ జిల్లా అధ్యక్షుడు పజ్జూరి జయహరి, లక్ష్మీనర్సయ్య, వై.సంజీవరెడ్డి, బజాజ్ నాగబండి సుదర్శనం, రవీందర్, అల్లాడి ప్రభాకర్, జైన రమేశ్, ఐత శ్రీనివాస్ పరామర్శించారు.

అంబేడ్కర్ చిత్రపటాల అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: బీఎస్పీ బహుజన జ్ఞాన ప్రచార సభ సందర్భంగా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ, ఏసీపీ, ఏఓ కార్యాలయాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు మహనీయుడు అంబేడ్కర్ చిత్రపటాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జ్ఞాన ప్రచార సభ ఆర్గనైజింగ్ సెక్రటరీ జింక బాబు, భాస్కుల నర్సయ్య, గుర్రం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న కేవీఎల్‌ఎన్ రెడ్డి

జనగామ రూరల్: గ్రామాల్లో ప్రతీ బూత్‌లో 200 తగ్గకుండా సభ్యత్వం నమోదు చేసి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఎల్‌ఎన్ రెడ్డి అన్నారు. శుక్రవారం వడ్లకొండలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో మండల అధ్యక్షుడు లద్దునూరి మహేశ్ అధ్యక్షతన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు మార్క ఉపేందర్, కార్యదర్శి సరికొండ భాస్కర్, సభ్యత్వ నమోదు ప్రముఖ్, నవీన్, నిమ్మలమధు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంకోటి, వరి, కిరణ్, రాజేష్ పాల్గొన్నారు.

సమస్యలపై ఎంపీడీఓకు వినతి



లింగాలఘణపురం: పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న ఆర్థిక, మానసిక సమస్యలపై శుక్రవారం ఎంపీడీఓ జలేందర్‌రెడ్డికి మండల పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. పంచాయితీ కార్యదర్శుల జిల్లా గౌరవ అధ్యక్షుడు రొండ్ల శ్రీనివాసురెడ్డి, మండల అధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నాగరాజుతో పాటు మండలంలోని జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

లింగాలఘణపురం: మండలంలోని కుందారం ఎస్సీ కాలనీ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రెడ్డి సొంత డబ్బులతో స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శ్రీలత, ఏఏపీసీ చైర్మన్ పార్వతి, సీఆర్‌పీ జ్యోతి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దేవరుప్పుల: హైదరాబాద్ రవీంద్రభారతిలో నేడు (శనివారం) ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు రమేశ్ శుక్రవారం పిలుపునిచ్చారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

జఫర్‌గఢ్: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని హెచ్‌ఎం మంగు జయప్రకాశ్ అన్నారు. మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఉద్యోగోన్నతిపై హెచ్‌ఎంగా వచ్చిన జయప్రకాశ్.. విద్యార్థులకు చికెన్‌తో కూడిన అతిథి భోజనాన్ని శుక్రవారం అందించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో బాదం లక్ష్మయ్య, కుడుదుల బసవయ్య మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించి రూ.5వేల చొప్పున సాయం అందజేశారు.

స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన గాదె కొమురమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బెలిదె వెంకన్న బాధిత కుటుంబానికి శుక్రవారం పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

ఎల్లమ్మగడ్డ తండా ఓటర్లను తొలగించాలి

పాలకుర్తి టౌన్: బమ్మెర గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా నుంచి ఎల్లమ్మగడ్డ తండా ఓటర్లను తొలగించాలని బమ్మెర గ్రామస్తులు కోరారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. బాలునాయక్, నాగిరెడ్డి, ధారా శారద శంకరయ్య, ఎల్లయ్య, కృపాకర్ ఉన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి

చిల్పూరు: పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎం కేతిడి నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి బాపునాయక్, కేశోజు వెంకట్రాజం, జీడి ఆనందం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

రఘునాథపల్లి: ఒక్కో రైతుకు ఇద్దరు, ముగ్గురి రైతుల ఆధార్ కార్డు లింక్ చేయడం, అప్పు చెల్లించినా రికార్డుల్లో బకాయి ఉండటం లాంటివి.. ఆన్‌లైన్‌లో సరి చేయాలని కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదని.. పలువురు బాధిత రైతులు శుక్రవారం మండలంలోని నిడిగొండ సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. రైతుల ఆందోళన సమాచారంతో కార్యాలయం తాళం కూడా తీయక పోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పు చెల్లించినా ఆన్‌లైన్‌లో బకాయి చూపుతుండటంతో అప్పు రూ. 2 లక్షలు దాటి రుణమాఫీ కాలేదని, ఇష్టానుసారంగా ఆధార్ కార్డులు లింక్ చేయడంతో రుణమాఫీకి పూర్తిగా దూరమయ్యామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా తిరుగుతున్నా అధికారులు, పాలకవర్గం ఎవరూ పట్టించుకోవడం లేదని, రిటైర్డ్ సీఈఓ రాజయ్య తన కొడుకు రాజ్‌కుమార్‌ను సీఈఓగా నియమించి అనేక అక్రమాలకు పాల్పడ్డారని, తమ పేరిట తీసుకున్న అప్పును వారి నుంచి వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మాసంపల్లి శాంతోజీ, ఎలపాటి రాంరెడ్డి ,వంగాల ఎల్లేష్, అబ్బాష్‌మియా, మైలారపు ఆంజనేయులు, కర్ణాకర్‌రెడ్డి, కొంగరి నర్సింగరావు, కమలాకర్, మాదవరెడ్డి, తిప్పారపు రవీందర్, నోముల సత్తయ్య, రాములు, యాదగిరి, చంద్రమౌళి, మోహన్‌రావు, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం కుసుమ రమేష్, పీడీ కొండ రవి తెలిపారు. పాఠశాలలో వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. ఈనెల 11న జనగామలోని ప్రిస్టన్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపికల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభతో కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిలో 10వ తరగతి నుంచి జి.వినయ్, బి.మణి, 9వ తరగతి విద్యార్థులు ఎస్.సాత్విక్, జి.తేజ, డి.చరణ్, బి.ఇందు 8వ తరగతి విద్యార్థి ప్రసన్న ఉన్నారని తెలిపారు. ఈనెల 22, 23వ తేదీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు. కాగా రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిని హెచ్‌ఎం, పీడీతో పాటు పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ జ్యోతి, పూర్వవిద్యార్థుల కమిటీ అధ్యక్షుడు జొన్నల రాజేశ్వరరావు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ భగత్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

హనుమాన్ భక్తుల నగర సంకీర్తన

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో హనుమాన్ మాలధారణ చేసిన స్వాములు శుక్రవారం నగరసంకీర్తన నిర్వహించారు. ఆంజనేయ స్వామి భజనలు చేస్తూ నగరవీధులలో పర్యటించారు. అనంతరం స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద హోమం పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వాములంతా సామూహికంగా కొండగట్టుకు బయలుదేరి వెళ్లారు. బంగ్లా శ్రీనివాస్, ఇల్లందుల రాజు, కొలిపాక రాజయ్య పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో హనుమాన్ మాలధారులు గ్రామ సంకీర్తన కార్యక్రమాన్ని చేపట్టారు. హనుమాన్ స్వాములు 41 రోజులు నియమనిష్ఠలతో పూజలు ఆచరించి పవిత్ర పుణ్యక్షేత్రమైన కొండగట్టుకు బయలుదేరారు. ఈ క్రమంలో ముందుగా స్వాములు హనుమాన్ భజనలు చేస్తూ గ్రామంలో ర్యాలీ తీశారు. మహిళలు స్వాములకు ఎదురేగి వారి కాళ్లపై బిందెలతో జలం పోస్తూ మంగళహారతులు అందించారు. అనంతరం 30 మంది స్వాములు కొండగట్టుకు సామూహికంగా బయలుదేరారు. కార్యక్రమంలో హనుమాన్ భక్తులు పులిగిళ్ళ గట్టయ్య, గంగుల రాజిరెడ్డి, బూరు ప్రవీణ్, మారబోయిన రజనీకాంత్, రమేష్, గోవిందు నాని, తిరుపతి, వెంకటేష్, బూరు శేఖర్, మధుకర్‌గౌడ్, రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ భక్తులు

సంక్షిప్త సమాచారం

వైద్యశిబిరం

లింగాలఘణపురం: విద్యార్థులు పరీక్షల సమయంలో ఆందోళన చెందవద్దని సైక్రియాటిస్టు డాక్టర్ వశిష్ట సూచించారు. మండలలలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ రవితేజ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సైక్రియాటిస్టు విద్యార్థులకు మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఒంటరివారమనే భావన, పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించేందుకు సూచనలు చేశారు.

వ్యసనాలకు బానిసకావొద్దు



చిల్పూరు: విద్యార్థులు వ్యసనాలకు బానిసకావొద్దని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం సంపత్ అధ్యక్షతన ఏర్పాటు అవగాహన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

పరామర్శ

జనగామ రూరల్: పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తిప్పారపు విజయ్ అనారోగ్యంతో స్థానిక కేకే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, శుక్రవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయనను పరామర్శించారు. అలాగే 11 వార్డుకు చెందిన నాయకుడు కుందా గోపాల్‌ను పరామర్శించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

రామవరం, మల్లంపల్లిలో..

కొడకండ్ల/పాలకుర్తిటౌన్: ఇటీవల మండలంలో మృతి చెందిన భాదిత కుటుంబాలను శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. రామవరం గ్రామంలో మృతి చెందిన సీనియర్ నాయకుడు దుంబాల లక్ష్మణ్‌జీ, రంగాపురం గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి కుటుంబసభ్యులను దయాకర్‌రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే పాలకుర్తి మండలం మల్లంపల్లిలో అనారోగ్యంగా మృతి చెందిన జిలుకర శ్రీనివాస్ కుటుంబాన్ని దయాకర్‌రావు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

చిన్నపెండ్యాలలో..

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ మాజీ సర్పంచ్ ఇల్లందుల రాజేందర్ కుమారుడు రిక్కి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి శుక్రవారం రాజేందర్‌ను పరామర్శించారు.

వంగాలపల్లిలో..

చిల్పూరు: మండలంలోని వంగాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు అరూరి రవిచందర్ తండ్రి యాదగిరి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య.. రవిచందర్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాటికాయల చిరంజీవి, అరూరి కార్తీక్ ఉన్నారు.

హర్షం

పాలకుర్తి టౌన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్, టెక్స్ టైల్ సంస్థ(ఐఐహెచ్‌టీ)కి కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు పెట్టడం హర్షణీయమని లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడరాపు సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పద్మశాలీలకు అరుదైన గౌవరం ఇచ్చిందన్నారు. ఈ మేరకు సీఎం రేంవత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మార్కండయ్య, పెనుగొండ, రమేష్, వెంకటేశ్వర్లు, వరప్రసాద్, వెంకన్న పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

జఫర్‌గఢ్: ఈనెల 27వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మిక మహాసభను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో మహాసభ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు పిన్నింటి నర్సింహారాములు, నాయిన రామస్వామి మాట్లాడారు. సంఘం మండల అధ్యక్షుడు సముద్రాల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీకి బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఏఐసీసీ అగ్రనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీపై వివాదస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతలు బేషరతుగా వెంటనే క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ప్రజాబలంతో ఎదుగుతున్న యువనాయకుడు రాహుల్‌గాంధీపై బీజేపీ నేతలు ఓర్వలేక అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నేతల మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని, రానున్న రోజుల్లో ప్రజలే వారికి గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు బీజేపీకి ఎంతమాత్రం లేదన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

పాలకుర్తి: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పాలకుర్తిలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పసునూరి నవీన్, మాచర్ల ఎల్లయ్య, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు మహాకరుణ శాఖాహార ర్యాలీ

దేవరుప్పుల: మండల కేంద్రంలోని శివశక్తి పిరమిడ్ ధ్యాన మందిరం నుంచి ఇండియన్ పెట్రోల్ బంక్ వరకు రేపు (ఆదివారం) మహాకరుణ శాఖాహార ర్యాలీ నిర్వహించనున్నట్లు శివశక్తి పిరమిడ్ నిర్వాహకులు చిలుకూరి రమాదేవి సత్యనారాయణ, అప్పిడి సోమిరెడ్డి పేర్కొన్నారు. .ధ్యాన, విశిష్టత, పిరమిడ్ శక్తి, శాఖాహార విశిష్టతతోపాటు ప్రకృతి, మూగ జీవాల పరిరక్షణ కోసం దోహదపడే ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ మహాకరుణ ర్యాలీ అనంతరం తెలంగాణ సేవాదళ్ అధ్యక్షుడు సీనియర్ పిరమిడ్ మాస్టర్ భూపతి రాజు(ధ్యాన గద్దర్)చే ఆత్మజ్ఞాన సందేశం ఉంటుందని, తదనంతరం అన్నప్రసాదం ఉంటుందన్నారు.